సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం ၊ 26 ၊ జూలై ၊ 2023



మిడ్‌మానేరుకు ఇన్‌ఫ్లో

బోయినపల్లి: మిడ్‌మానేరులోకి మంగళవారం సాయంత్రం వరకు 6,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్ఎండీకి 1,530 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 15.98 టీఎంసీల మేర నీరు ఉంది.



పాఠశాలల సందర్శన

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి ప్రభుత్వ పాఠశాల, మండెపల్లి మోడల్ స్కూ ల్‌ను మంగళవారం డీఈవో రమేశ్‌కుమార్ సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు సిరిసిల్లకు మంత్రి కేటీఆర్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణ బీఆర్ఎస్ నాయకుడు కొమిరే సంజీవ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా సంతాపం తెలియజేసేందుకు బుధవారం మంత్రి కేటీఆర్ సిరిసిల్లకు రానున్నారు. సంజీవ్ దినకర్మ నిర్వహించేందుకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో బందారి ఫంక్షన్ హాలులో ఏర్పాట్లు చేయగా సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి మంగళవారం రాత్రి పరిశీలించారు.

'మల్కపేట'ను పరిశీలించిన ఈఎన్సీ



మల్కపేట రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఈఎన్సీ వెంకటేశ్వర్లు, అధికారులు

సిరిసిల్ల: జిల్లాలోని కోనరావుపేట మండలం మల్కపేట జలాశయాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు–9వ ప్యాకేజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో 9వ ప్యాకేజీ పంపులను తనిఖీ చేశారు. మధ్యమానేరు నుంచి ఒక్క టీఎంసీ నీటిని మల్కపేట రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో మల్కపేట వద్ద నిర్మించిన రెండు పంపులను పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీలో భాగంగా నిర్మించిన మల్కపేట రిజర్వాయర్‌ను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వారంపది రోజుల్లో గోదావరి జలాలతో మల్కపేట రిజర్వాయర్‌ను నింపనున్నారు. ఈఎన్సీ వెంట ప్రాజెక్టు 9వ ప్యాకేజీ ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈలు వినోద్‌కుమార్, సత్యనారాయణ, ఎంఆర్‌కేఆర్ ఏజెన్సీ ఇంజినీర్లు చంద్రమోహన్, రఘునాథ్‌రెడ్డి, డబ్ల్యూపీఐఎల్ ఏజెన్సీ ఇంజినీర్ పణి భూషణ్‌రావు పాల్గొన్నారు.

ఒకటిన బోయినపల్లిలో థాణా దివస్

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆగస్టు 1న(మంగళవారం) థాణా దివస్ నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతల రక్షణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను నేరుగా ప్రజలనుంచి తెలుసుకోవాలనే ఉద్దేశంతో థాణా దివస్ ఏర్పాటు చేసి స్వయంగా ఫిర్యాదులు తీసుకుని సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేస్తున్నట్లు వివరించారు. దీర్ఘకాలిక పెండింగ్ కేసులు, శాంతి భద్రత సమస్యలను చట్టపరంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు థాణా దివస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'తెలుగు వెలుగు' పురస్కారాలకు దరఖాస్తులు

సిరిసిల్లకల్చరల్: వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వ్యక్తులకు అందించే పురస్కారాల కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి యాదగిరిగౌడ్ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాలను అందజేస్తామన్నారు. కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, సంగీతం, నృత్యం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, ఉపాధ్యాయులు, క్రీడలు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాల్లో ఉన్న వారు ఆగస్టు 10లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు 9100174351 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

27న మినీ జాబ్‌మేళా

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రైవేట్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఈ నెల 27న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన యువత మేళాలో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపికైన వారికి ప్రతి నెలా రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హతగల వారు నేరుగా తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఒరిజినల్‌తో పాటు జిరాక్స్ కాపీలతో నేరుగా నర్సింగ్ కాలేజీ పక్కన గల అంబేడ్కర్ భవన్‌కు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99633 57250 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

వరద పరవళ్లు

- జిల్లాలో జోరుగా వర్షాలు
- అలుగుపారుతున్న 114 చెరువులు
- నీటి వనరుల్లోకి చేరుతున్న నీరు
- నిండుకుండలా ఎగువమానేరు.. మత్తడి దూకుతున్న మూలవాగు
- వీర్నపల్లిలో అత్యధికంగా 74 మిల్లీ మీటర్ల వర్షపాతం



- 'ఇది జిల్లాలోని గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం. 31 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టులోకి ప్రస్తుతం 30 అడుగుల నీరు చేరింది. మరో అడుగు నీరు వస్తే మత్తడి దూకనుంది. సిరిసిల్ల మానేరువాగు నిండా పారుతుంది. ఎగువమానేరులోకి కామారెడ్డి జిల్లా నుంచి పాల్వంచ వాగు, సిద్దిపేట జిల్లా నుంచి కూడెల్లి వాగుల్లో వరద వచ్చి చేరుతుంది. దీంతో ఎప్పుడైనా ఎగువ మానేరు ప్రాజెక్టు మత్తడి దూకవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ జలాశయం నిండితే గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని 10వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మానేరు వెంబడి ఉండే గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి'.



'ఇది కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు జలాశయం. నిజామాబాద్ జిల్లా సిరికొండ అటవీ ప్రాంతంలో జోరుగా వానలు పడడంతో ఒర్రెల ద్వారా వచ్చి నీరు చేరింది. దీంతో 19 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న మూలవాగు జలాశయం నిండి మత్తడి దూకుతుంది. ఇలా మత్తడి ద్వారా వచ్చిన వరద వేములవాడ మూలవాగు ద్వారా మధ్యమానేరు జలాశయంలోకి చేరుతుంది. నిమ్మపల్లి మూలవాగుతో కుడి, ఎడమ కాల్వల ద్వారా 2,600 ఎకరాలకు సాగు నీరు అందనుంది'.



- 'ఇది రుద్రంగి మండల కేంద్రంలోని గోలెపులొద్ది చెరువు. ఇది నిండడంతో నీరు మత్తడి ద్వారా వెళ్లిపోతుంది. జిల్లాలోని 13 మండలాల్లో ఒక్కటి, రెండు కాదు.. ఏకంగా 114 చెరువులు మత్తడి దూకుతున్నాయి. జిల్లాలో మొత్తం 656 చెరువులు ఉండగా, అన్నింటిలోకి వర్షం నీరు చేరుతుంది. ఇప్పటికే 111 చెరువుల్లో 75 నుంచి 100 శాతం మేరకు నీరు చేరింది. ఇంకా చేరితే మత్తడి దూకేందుకు సిద్ధంగా ఉన్నాయి. 50 నుంచి 75 శాతం మేరకు 116 చెరువులు, 25 నుంచి 50 శాతం మేరకు 85 చెరువులు నిండాయి'.

సిరిసిల్ల: జిల్లావ్యాప్తంగా రెండురోజుల పాటు కాస్త గెరువిచ్చిన వర్షం మళ్లీ »ముసురు«కుంది. సోమవారం రాత్రి నుంచే భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లా తడిసి ముద్దయింది. వ్యవసాయ పనులకు ఆటంకంగా మారింది. అదను దాటిపోతుందని రైతులు వరినాట్లు వర్షంలోనూ వేస్తున్నారు. మొన్నటి వరకు కాలం లేదని ఆగిన రైతులు ఇప్పుడు కాలం కలిసిరావడంతో సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు జిల్లాలో ముసురువర్షంలో జనం బయటికి రాలేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. సిరిసిల్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాల వీధుల్లో వరద చేరింది. పట్టణంలో పెద్దగా వరద ముంపు లేకున్నా.. ఎప్పటికప్పుడు వర్షం నీరు వెళ్లి పోయేలా మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ప్రజలకు గొడుగులు పట్టుకుని అత్యవసర పనులకు వెళ్తున్నారు. జిల్లాలో చలిగాలులతో కూడిన వర్షం జల్లులు ఇంకా కురుస్తూనే ఉన్నాయి. బుధవారం కూడా వర్షం పడుతుందని వాతావరణ శాఖ సూచనలున్నాయి.

వీర్నపల్లిలో అత్యధికం

జిల్లాలో మంగళవారం కురిసిన వర్షంలో అత్యధికంగా వీర్నపల్లిలో 74.0 మిల్లీ మీటర్లు ఉండగా.. అత్యల్పంగా బోయినపల్లిలో 32.8 మి.మీ కురిసింది. రుద్రంగి 59.2, చందుర్తి 45.8, వేములవాడరూరల్ 33.1, సిరిసిల్ల 38.2, వేములవాడ 48.2, కోనరావుపేట 66.5, ఎల్లారెడ్డిపేట 69.8, గంభీరావుపేట 42.5, ముస్తాబాద్ 52.2, తంగళ్లపల్లి 57.2, ఇల్లంతకుంటలో 48.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో కలిపి సగటు వర్షపాతం 51.4 మి.మీ నమోదు కావడం విశేషం. గతేడాది ఇదే రోజు వరకు 707.4 మి.మీ వర్షం పడగా, ఈసారి ఇప్పటి వరకు జిల్లాలో 441.7 మి.మీ వరకు వర్షం కురిసింది. మూడు మండలాల్లో సాధారణ, ఎనిమిది మండలాల్లో ఎక్కువ వర్షం పడింది. రెండు మండలాల్లో అత్యధికంగా వర్షపాతం నమోదైంది.

అన్ని చెరువుల్లోకి నీరు



జిల్లాలోని అన్ని చెరువుల్లోకి వరద నీరు చేరుతుంది. ఇప్పటికే చాలా చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయి. ఇంకా కొన్ని చెరువులు మత్తడి దూకేందుకు సిద్ధంగా ఉన్నాయి. వాగులు, ఒర్రెల్లో వర్షం నీరు పారుతుంది. జిల్లాలో మంచి వానలు పడుతున్నాయి. భూగర్భ జలాలు పెరుగుతాయి.

– గంగం శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ, 9వ ప్యాకేజీ



- 'ఇది వీర్నపల్లి మండలం గర్జనపల్లి––మరిమడ్ల మధ్య వాగు. అటవీ ప్రాంతాల్లో వర్షం భారీగా పడడంతో గర్జనపల్లి మూలవాగు ఇలా ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ వరద నీరంతా నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టులోకి చేరుతుంది. ఇలా జిల్లాలోని నక్కవాగు, పెంటివాగు, గంజివాగు, సంద్రవాగు, బిక్కవాగు, బొగ్గుల వాగుల్లో నీరు పారుతోంది. ఈ వాగులన్నీ మానేరు, మూలవాగుల్లోకి చేరి చివరికి మధ్యమానేరు జలాశయంలోకి చేరుతాయి. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో సాగునీటి వనరులు నిండుకుండల్లా మారుతున్నాయి.



నిండుగా సంద్రవాగు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మూడునాలుగు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో మండలంలోని సంద్రవాగు నిండుగా పారుతోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రుద్రంగిలో..

రుద్రంగి(వేములవాడ): మండల పరిధిలోని మానాల తాతమ్మ వాగు పొంగి పొర్లుతుంది. లోలెవల్ వంతెన వద్ద వరద ప్రవాహాన్ని అధికారులు పరిశీలించారు. వాగు వరద గొర్రె గుండం జలపాతంలోకి వెళ్లడంతో జలపాతం పరవళ్లు తొక్కుతోంది.

వీర్నపల్లిలో..

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని మద్దిమల్ల రాయిని చెరువు మత్తడి దూకుతుండగా, గర్జనపల్లి మూలవాగు నిండుగా ప్రవహిస్తుంది. వర్షాలకు మండల కేంద్రంలోని లెంకల లచ్చయ్య, జంగం నర్సవ్వ ఇళ్లు దెబ్బతిన్నాయి.



రామలక్ష్మణపల్లెలో ఆలయం చుట్టూ చేరిన నీరు



ఎర్రకుంటకు జలకళ

ఇల్లంతకుంట(మానకొండూర్): మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుంది. రేపాక గ్రామంలోని ఎర్రకుంట మత్తడి దూకుతుంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఇలాగే కురిస్తే మండలంలోని 94 చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారనున్నాయి.



మూలవాగు ఉధృతి

వేములవాడ: భారీ వర్షాలకు వేములవాడలో మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పట్టణవాసులు పెద్ద ఎత్తున బ్రిడ్జి వద్దకు చేరుకుని నీటి ప్రవాహాన్ని వీక్షిస్తున్నారు.

రాకపోకలు బంద్



వేములవాడఅర్బన్: వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట నక్కవాగు ఉధృతంగా పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లోలెవల్ వంతెన నుంచి ప్రయాణికులు వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు.



చిప్పలపల్లిలో కూలిన ప్రహరీ

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎడతెరిపి లేని వానలకు ఆవునూర్ పెద్ద చెరువు అలుగు పారింది. చిప్పలపల్లిలో గాడిచర్ల వెంకటనర్సు ఇల్లు ప్రహరీ కూలిపోయింది. అలాగే కాశయ్య, ఆవునూర్‌లో అలువాల భాస్కర్ ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రామలక్ష్మణపల్లెలో మానేరు వాగు వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో వంతెనను మూసివేసినట్లు సర్పంచ్ రవీందర్‌రెడ్డి తెలిపారు. సీతారామచంద్రస్వామి ఆలయం చుట్టూ వరద చేరింది.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. వేములవాడ తిప్పాపూర్ వద్ద మూలవాగు కరకట్టపై సుందరీకరణ పనులు ఆగస్టు 15 వరకు పూర్తి చేయాలన్నారు. జగిత్యాల కమాన్ కూడలి అభివృద్ధి పనులు ప్రారంభించాలని, పట్టణంలో »మన ఊరు.. మన బడి«లో చేపట్టిన పనులను ఈనెల 31 లోగా పూర్తి చేయాలని సూచించారు. వేములవాడ ధర్మగుండాన్ని ఆధ్యాత్మిక ఉట్టిపడేలా అభివృద్ధి చేయాలని, నిర్మాణంలో ఉన్న శివార్చన స్టేజీ, బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని సూచించారు. సిరిసిల్ల పట్టణ శివారులోని ఈదుల చెరువులో ఆక్రమణలను తొలగించాలని, రగుడు పెద్ద చెరవుకు గేట్లు నిర్మించాలన్నారు. సమీక్షలో ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, పవన్‌కుమార్, వేములవాడ ఆలయ ఈవో కృష్ణప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్‌రావు, మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేష్, ఆలయ ఈఈ రాజేశ్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, తహసీల్దార్ విజయ్‌కుమార్, రాజు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

టెక్నాలజీతో విధులు నిర్వహించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ శాఖ నూతనంగా ఆవిష్కరించిన సీసీటీఎన్ఎస్ నూతన వర్షన్ 2.0పై పోలీసు అధికారులు, టెక్‌టీంకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీటీఎన్ఎస్ 2.0 అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేయడం జరిగిందని, దీంతో పనిభారం లేకుండా ఉత్సాహంగా విధులు నిర్వహించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది దీనిని వినియోగించే విధానాలు నేర్చుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన అన్ని కేసుల వివరాలు 'ది క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్స్ అండ్ సిస్టమ్స్' (సీసీటీఎన్ఎస్)లో అప్లోడ్ చేసి పెండింగ్ కేసులు పూర్తి చేయాలని సూచించారు. వృత్తి నైపుణ్యంలో రోజువారీ పురోగతి సాధించాలని, ప్రతి ఒక్కరికీ విధి నిర్వహణ గురించి రోల్ క్లారిటీ తెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఉపేందర్, ఐటీ కోర్ ఎస్ఐ కిరణ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు 9న సిరిసిల్లలో డ్యాన్స్ ఫెస్టివల్స్

- 766 మంది చిన్నారులతో నృత్య ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ సమ్మయ్య, నిర్వాహకులు

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆగస్టు 9న జాతీయస్థాయి డ్యాన్స్ ఫెస్టివల్స్ నిర్వహించనున్నారు. లంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ మ్యూజికల్, డ్యాన్స్ ఫెస్టివల్–47 సిరిసిల్ల సినారె కళామందిరంలో జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, డ్యాన్స్ మాస్టర్స్ నక్క అశోక్, పాందుర్తి ధర్మేందర్ ఆవిష్కరించారు. ఒకే వేదికపై 766 మంది చిన్నారులు ఒకే పాటపై నృత్యం చేసి ఆస్కార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నమోదు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆగస్టు 9న మధ్యాహ్నం 2 గంటల నుంచి డ్యాన్స్ ఫెస్టివల్ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆజాదీకి అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశానికి స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ వేడుకను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వివరించారు. సిరిసిల్ల పట్టణ వాసులు సహకరించి విజయవంతం చేయాలని డ్యాన్స్ కంపోజర్ సుంకటి సురేశ్, డ్యాన్స్ మాస్టర్లు తడగొండ మధు, జంగిలి రఘు, వేముల శ్రీకాంత్, కత్తెరపాక వెంకటేశ్, దూలపల్లి రాకేశ్ కోరారు.

'ప్రభుత్వ స్కూళ్లను పట్టించుకోని పాలకులు'

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అధికార బీఆర్ఎస్ పాలకులు పట్టించుకోవడం లేదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర సభ్యుడు ధరంసోత్ ప్రకాశ్‌నాయక్ ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆగస్టు 1న ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగసభ వాల్‌పోస్టర్‌ను మంగళవారం ముస్తాబాద్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. కేజీ నుంచి పీజీ వరకు పెండింగ్‌లో ఉన్న రూ.5,300 కోట్ల స్కాలర్‌షిప్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్పొరేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. మండల కన్వీనర్ కిశోర్, మధు, రాజేశ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



లోతట్టు ప్రాంతంలో వరదనీరు

లోతట్టులో జనం హైరానా



శాంతినగర్ కాలనీలో వరద

సిరిసిల్లటౌన్: తెల్లార్లు జోరు వానలు కురియడంతో లోతట్టు ప్రాంతాల వాసులు హైరానా పడుతున్నారు. వెంకంపేట, పద్మనగర్, అనంతనగర్, సంజీవయ్యనగర్, ఆటోనగర్, కరీంనగర్ రోడ్డు, రాళ్లబావి, శాంతినగర్, శ్రీనగర్ ప్రాంతాల్లో వర్షం పడితే చాలు ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపేస్తున్నారు. శాంతినగర్, శ్రీనగర్‌లో రోడ్లు పూర్తిగా మునిగిపోయాయి. పైన ఉన్న కొత్తచెరువు, ఈదులచెరువు, బోనాల తదితర చెరువులు పూర్తిగా నిండి అలుగు పారితే ఆయా ప్రాంతాలు పూర్తిగా జలదిగ్బంధం తప్పదని స్థానికులు హైరానా పడుతున్నారు. నాలాలు కబ్జా కావడంతో తాత్కాలిక నాలాల ఏర్పాటుకు అధికారులు ప్రయత్నిస్తుంటే, తద్వార తమ ప్రాంతాలను వరదల్లోకి నెట్టద్దంటూ అధికారులతో ప్రజలు వాగ్వాదానికి దిగుతున్నారు. గడిచిన వర్షాకాలం మొదలుకుని ఇప్పటి వరకు వరదల నివారణకు చర్యలు చేపట్టకపోవడంపై అధికార యంత్రాంగంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం లోతట్టు ప్రాంతాల్లో కనిపించిన దృశ్యాలివి.

క్లుప్తంగా

కల్వర్టు పరిసరాల్లో చెత్త, చెట్లు తొలగింపు



చెత్తను తొలగిస్తున్న జేసీబీ వద్ద డీఎస్పీ తదితరులు

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే బీటీ రోడ్డులో ఉన్న లోలెవల్ కల్వర్టుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, ఎండిన చెట్ల కొమ్మలు, తదితర వ్యర్థాలతో కల ్వర్టు కింద నుంచి వరద నీరు వెళ్లడం లేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల ్వర్టుపై నుంచి వరద నీరు పారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి మంగళవారం కల్వర్టు పరిసరాల్లో పేరుకుపోయిన ఎండిపోయిన చెట్ల కొమ్మలు, పిచ్చి చెట్లు జేసీబీతో తీయించారు. అలాగే స్థానిక యువకులు కూడా శ్రమదానం చేశారు. వరద నీరు కల్వర్టు కింది నుంచి వెళ్లే పనులు చేపట్టారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, వాగులు, వంకలు పొంగిపొర్లి వరద ఉధృతి సమయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఆయన వెంట ఎస్సై మామిడి మహేందర్, సంబ లక్ష్మీరాజం తదిత రులు యువకులు ఉన్నారు.

మెరుగైన విద్య అందించేందుకు కృషి



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: కొత్తగా ఏర్పడిన జిల్లా మెడికల్ కాలేజీలో మెరుగైన వైద్య విద్య అందించేందుకు కృషి చేస్తామని తెలంగాణ టీచింగ్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. మంగళవారం జిల్లాసుపత్రి మెడికల్ కాలేజీలో టీటీజీడీఏ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ప్రభుత్వం యూజీసీ, పీఆర్సీ–2016 ఏరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని, జనరల్ ట్రాన్స్‌ఫర్స్ చేయాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సి.సంతోష్, కోశాధికారి కె.అరుణ్, ఉపాధ్యక్షులు ఇక్బాల్, సుగుణ, సహాయ కార్యదర్శులు శ్రవణ్, సాధన, కార్యవర్గ సభ్యులు వంశీధర్, సతీష్, శృతి, క్రాంతికిరణ్, నయన, అర్పిత, ఆముక్తమాల్యద, నూర్ ఉల్, రవి, కిరణ్ ఎన్నికయ్యారు.

పల్లె ఒడిన పీర్ల పండుగ

- వారం రోజుల పాటు వేడుకలు
- 29న మొహర్రంతో ఉత్సవాల ముగింపు



తడగొండలో ప్రతిష్ఠించిన పీర్లు

బోయినపల్లి(చొప్పదండి): పల్లె ఒడిన పీర్ల పండుగ కొత్త శోభను తెచ్చిపెట్టింది. గ్రామాల్లో హిందు, ముస్లిం భేదం లేకుండా అందరూ కలిసి ఆనందంగా జరుపుకునే పీర్ల పండుగ వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వారం రోజుల పాటు పీర్ల పండుగ ఉత్సవాలు నిర్వహించడం గ్రామాల్లో అనాదిగా వస్తున్న ఆచారం. మండలంలోని తడగొండ, బోయినపల్లి తదితర గ్రామాల్లో పీర్లను ప్రతిష్ఠించారు. ఈ నెల 29న జరిగే మొహర్రం పర్వదినంతో ఉత్సవాలు ముగుస్తాయి.

మలీద ముద్దలు.. బెల్లం శాక..

గ్రామాల్లో పూర్వ కాలం నుంచి గ్రామ చావడి లేదా మసీదుల్లో పీర్లను ప్రతిష్ఠిస్తారు. పీర్లు ప్రతిష్ఠించిన ప్రదేశం ముందు అలాం (గుండం) నిర్మిస్తారు. నిర్వాహకులు రోజు సాయంత్రం పీర్లకు మలీద ముద్దలు, బెల్లం శాక, ఊదు బెల్లం చదివిస్తారు. అనంతరం పీర్లను ఊరేగిస్తారు. పీర్లను ఊరేగించే సమయంలో కొందరికి పూనకం వస్తుంది. గ్రామాల్లో ఇలాంటి వారిని పీర్ల దేవుడు వచ్చిండు అంటారు. వారు పీర్లను పట్టుకుని ఉత్సాహంగా తిరుగుతారు.

చిన్న చెరుగత్.. పెద్ద చెరుగత్

పీర్లు ప్రతిష్ఠించిన ఐదోరోజు చిన్న చెరుగత్ పేరిట చిన్న మట్కీలు తీస్తారు. అనంతరం మళ్లీ మొహర్రంకు ఒక రోజు ముందు పెద్ద చెరుగత్‌తో పెద్ద మట్కీలు తీస్తారు. పీర్ల దేవునికి మొక్కుకున్న వారు మట్కీలు తీస్తారు. అంటే భక్తి శ్రద్ధలతో చేసిన మలీద ముద్దలు, బెల్లం శాక, శెనగ పప్పు, బగార బువ్వను కుండలో పెట్టి కుండను ఎత్తుకుని వెళ్లి పీర్లకు చదివిస్తారు. వారం పాటు నిర్వహించే ఉత్సవాలు మొహర్రం పర్వదినం రోజు నిర్వహించే పీర్ల నిమజ్జనంతో ముగుస్తాయి. ఊరేగింపులో పలువురు పీర్లకు దట్టీలు, బుట్టిలు, కుడుకుల పేర్లు, కొత్త వస్త్రాలు కడతారు. అనంతరం పీర్ల నిమజ్జనం చేస్తారు. పీర్ల ప్రతిష్ఠ ముందు నిర్మించే అలాం చుట్టూ రోజు హిందూ, ముస్లిం భేదం లేకుండా అసోయి దూలా.. అంటూ ఆటలు ఆడుతూ, పాటలు పాడుతారు.

వారం పాటు ఉత్సవాలు



బోయినపల్లిలో పీర్ల ప్రతిష్ఠ చేయడం జరిగింది. వారం పాటు ఉత్సవాలు చేస్తాం. రోజూ ఊదు, బెల్లం శాక పీర్లకు చదివిస్తాం. అలాగే చిన్న చెరుగత్, పెద్ద చెరుగత్ రోజు మట్కీలు తీసి ఉత్సవాలు చేస్తాం. ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో పాల్గొంటారు.

– తాజొద్దీన్, బోయినపల్లి

హిందూ, ముస్లిం ఐక్యతకు ప్రతీక



తడగొండ గ్రామంలో చాలా ఏళ్లుగా పీర్ల పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఉత్సవాల్లో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొంటారు. చాలా మంది మలీద ముద్దలు, బగార బువ్వతో మట్కీలు తీస్తారు. మొహర్రంకు ముందు ఉదయం అగ్ని గుండం చుట్టూ పాటలు పాడుతూ జోష్‌గా ఆడుతారు.

– ఎండీ. అహ్మద్‌హుస్సేన్, తడగొండ

రాజన్న ఆలయంలో విజిలెన్స్ దాడులు

- బెంబేలెత్తిన అధికారులు
- సిబ్బందిలో అయోమయం



ఈవో కృష్ణప్రసాద్‌తో చర్చిస్తున్న విజిలెన్స్ అధికారులు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో మంగళవారం విజిలెన్స్ దాడులు జరిగాయి. సీఐలు అనిల్‌కుమార్, వరుణ్‌ప్రసాద్, తహసీల్దారు దినేశ్‌రెడ్డి, ఏఈ శశిధర్, ఇద్దరు కానిస్టేబుళ్ల బృందం ఆలయానికి చేరుకుంది. ముందుగా ప్రసాదాల తయారీ గోదాం, ప్రసాదాల విక్రయ కౌంటర్లు, ఆలయంలోని విభాగాలను తనిఖీ చేసి రికార్డులు స్వాధీనపరచుకున్నారు. అనంతరం ఈవో చాంబర్‌కు చేరుకుని రికార్డులు పరిశీలించారు. ప్రసాదాల తయారీకి వాడే కాజు, కిస్మిస్, చక్కెర మిశ్రమాల తీరు, గోదాంలోని స్టాక్, ప్రసాదాల కౌంటర్‌లోని స్టాక్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయంలో అధికారుల సీనియారిటీ జాబితా, ఉద్యోగుల ప్రమోషన్‌లో తీసుకున్న చొరవ, గతంలో విజిలెన్స్ కేసుల్లో ఉన్నవారి వివరాలు, వారు చేస్తున్న డ్యూటీపై విచారణ చేపట్టారు. కాగా విజిలెన్స్ అధికారుల తనిఖీలతో అధికారులు, సిబ్బంది అయోమయానికి గురయ్యారు. ఎక్కడివారక్కడే తమతమ విభాగాల్లో పనులు చేసుకుంటూ కనిపించారు. ఈవిషయంపై విజిలెన్స్ అధి కారులను విలేకరులు ప్రశ్నించగా, తమకు అందిన ఫిర్యాదుల మేరకు ఆలయంలో తనిఖీలు నిర్వహించి, రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షేమం.. పరిహాసం



కాటన్ డబ్బాలను కూలీగా మోసుకెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

సిరిసిల్లటౌన్: భుజంపై పెద్ద అట్టపెట్టెను మోస్తున్న ఈమెను చూసి దినసరి కూలీ అనుకుంటే తప్పులో కాలేసినట్టే. ప్రభుత్వ పథకాలను ప్రజలను చేరవేసే సంక్షేమ వారధిగా నిలబడే అంగన్‌వాడీ కార్యకర్త. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఈమె స్కూలుకు సంబంధించిన ప్రీస్కూల్ కిట్లు తీసుకెళ్లడానికి అధికారులు పిలిస్తే వచ్చింది. ఆటో కిరాయిలు భరించైనా కిట్లను తీసుకెళ్లాలనుకుంది. సుమారు 25కిలోల బరువుండే అట్టపెట్టెలను గోదాం నుంచి ఆటోలో వేసేందుకు ఆఫీస్ సిబ్బంది, సహాయకులు ఎవరూ సహకరించకపోవడంతో.. హమాలీలను మాట్లాడుకోలేని స్థితిలో ఇలా మహిళా కూలీగా మారాల్సి వచ్చింది. ఈఫోటో స్థానికంగా సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. అరకొర వేతనాలు, పెండింగ్ బిల్లులు, విధి నిర్వహణలో పనికి మించిన భారంతో విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై అధికారుల చిన్నచూపు చూడడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

‘ఆరోగ్య మహిళ’ శిబిరానికి స్పందన



నేరెళ్ల పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ కార్యక్రమం

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ‘ఆరోగ్యమహిళ’ కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యారోగ్య శాఖ చేపట్టిన ‘ఆరోగ్య మహిళ’ శిబిరానికి మంచి స్పందన వస్తుందన్నారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఏసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ 332, బ్రెస్ట్ 327, ఓరల్ కావిటీ 328 పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ 11, ల్యాబ్46, థైరాయిడ్ 31, విటమిన్ డీ 25, సీబీపీ 38, సూక్ష్మ పోషకాలు 45 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో ముగ్గురిని జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.

కాంగ్రెస్‌తోనే బలహీనవర్గాలకు రాజ్యాధికారం

- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు



మాట్లాడుతున్న వి.హన్మంతరావు

కరీంనగర్‌టౌన్: బలహీనవర్గాలకు రాజ్యాధికారం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ ఐక్య వేదిక సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా వి.హనుమంతరావు, మంథని శాసనసభ్యుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనమండలి సభ్యుడు జీవన్ రెడ్డి హాజరయ్యారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ. చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగిందని, ఇలాంటి ముఖ్యమంత్రిని నేను ఎన్నడు చూడలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీసీల గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలోనే న్యాయం జరిగిందని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మల్లిఖార్జున కర్గేను ఏఐసీసీ అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని అన్నారు. తాను రెడ్డి సామాజికవర్గానికి చెందినవాడినైతే ఎప్పుడో ముఖ్యమంత్రి అయ్యేవాడినని అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ 60శాతం ఉన్న బలహీనవర్గాల వారికి సముచిత స్థానం కల్పించాలన్నారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు చెందిన వారిని పీసీసీ అధ్యక్షులుగా ఎంతో మందికి అవకాశం కల్పించిందని ఇది వేరే పార్టీల వల్ల అవుతుందా అని అన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్కాన్ సింగ్, ఈర్ల కొమురయ్య, వైద్యుల అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నం దూరం...

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీలో చోటు కల్పించకపోవడంపై అలకబూనిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ బీసీ ఐక్య వేదిక సమావేశానికి హాజరు కాలేదు. పొన్నం అనుచరులు సైతం హాజరుకాకపోవడంతో సభ వెలవెలపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ నేతృత్వంలో బీసీ నేతలు చొరవ తీసుకొని ఉదయం నుంచే ఉమ్మడి జిల్లాలోని నాయకులందరికీ ఫోన్లు చేసి కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషిచేశారు.

బాధితుల వివరాలు సేకరణ



సాక్షి స్పందన

వివరాలు సేకరిస్తున్న అధికారి

రుద్రంగి(వేములవాడ): ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆదివారం రాత్రి రుద్రంగి మండల కేంద్రానికి చెందిన చిన్న మల్లయ్య ఇల్లు కూలిపోయి నిరాశ్రయులయ్యారు. నిత్యవసర సరుకులు తడిసిపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని ‘సాక్షి’లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం అధికారులు చిన్న మల్లయ్య ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం వచ్చేలా నివేదిక పంపారు.

బోరు మోటారు ధ్వంసం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో పొలం వద్ద బోరు మోటారును వ్యక్తిగత కక్షలతో ధ్వంసం చేశారని రైతు గీస శంకర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు రోజుల క్రితం బోరు నీటి కోసం కట్టిన కుండీని ధ్వంసం చేసిన వ్యక్తులు, ఇప్పుడు బోరు మోటారు పనిచేయకుండా బండరాళ్లతో ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో పంటలకు నీరందని పరిస్థితి నెలకొందని, పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

‘అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి’



వినతిపత్రం ఇస్తున్న అనిల్

వేములవాడఅర్బన్: వేములవాడ సెస్‌లో పనిచేస్తున్న అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి పోతు అనిల్ సిరిసిల్ల సెస్ ఎండీ రామకృష్ణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ, వేములవాడ పట్టణంలో పేద ప్రజలకు రూ.2 వేల నుంచి రూ.3 వేలు బిల్లు వస్తే బిల్ కలెక్టర్లుగా పనిచేస్తున్న వారు బిల్లు కట్టకుంటే విద్యుత్ కట్ చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. అదే అగ్రవర్ణాలకు, రాజకీయ నాయకులకు మాత్రం లక్షల రూపాయల కరెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నా వారికి విద్యుత్ అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రవిగౌడ్, రాములు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పద్మనగర్ గ్రామ శివారు ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన ద్విచక్ర వాహనదారు బుడిగె యాదగిరి తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డు పక్కన రక్తపు మడుగులో ఉన్న యాదగిరిని వాహనదారులు గుర్తించి 108కు సమాచారం అందివ్వడంతో అతడిని వెంటనే సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యాదగిరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. కాగా ప్రమాదానికి సంబంధించిన కారణాలు తెలియరాలేదు. ఏదైనా వాహనం ఢీకొట్టిందా లేదా తనకు తానుగా అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడా తెలియాల్సి ఉంది.

గాయాలు కాలేదని చెప్పి.. అనంతలోకాలకు

- బొలెరో వాహనం, కారు ఎదురెదురుగా ఢీ
- బంధువులతో ఫోన్‌లో మాట్లాడిన అరగంటకే మృతి
- మృతుడు ధర్మపురి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు
- బంజేరుపల్లి తండా బి వద్ద ఘటన



ప్రమాదం తర్వాత ఫోన్‌లో మాట్లాడుతున్న సత్యనారాయణ



సత్యనారాయణ (ఫైల్)

ధర్మారం/ధర్మపురి: రోడ్డు ప్రమాదానికి గురైన కారులో నుంచి దిగాడు.. తనకు ఎలాంటి గాయాలు కాలేదని బంధువులకు ఫోన్‌లో తెలిపాడు.. ఆ తర్వాత అరగంటకే అనంతలోకాలకు వెళ్లిపోయాడు ధర్మపురికి చెందిన న్యాయవాది బండారి సత్యనారాయణ(49). ప్రత్యక్ష సాక్షులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. సత్యనారాయణ గతంలో బార్ అసోసియేషన్ ధర్మపురి అధ్యక్షుడిగా పని చేశారు. మంగళవారం జగిత్యాల కోర్టులో పని ముగించుకొని, తన సొంత పనులపై కారులో కరీంనగర్ వెళ్లారు. అక్కడి నుంచి ధర్మపురి వస్తుండగా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బంజేరుపల్లి తండా బి గ్రామం వద్ద ఆయన కారు, మేకల లోడ్‌తో ఆర్నకొండ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెరో రోడ్డు కింద బోల్తా పడింది. ఆ వాహన డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో సత్యనారాయణ ఒంటిపై ఎలాంటి గాయాలు కాలేదు. ఆయన బయటకు వచ్చి, వెంటనే తన బంధువులకు ఫోన్‌లో జరిగిన విషయం చెప్పాడు. తనకు ఎలాంటి గాయాలు కాలేదన్నాడు.

గతంలో గుండెకు స్టంట్లు..

అప్పటికే స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనం సంఘటన స్థలానికి చేరుకుంది. వాహనంలోకి ఎక్కిస్తుండగానే సత్యనారాయణ ప్యాంట్‌లో మూత్ర విసర్జన చేసినట్లు స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆయన గుండెకు కొన్ని నెలల క్రితం స్టంట్లు పడినట్లు బంధువులు పేర్కొన్నారు. మృతుడికి భార్య శోభ, ఇంటర్ చదివే కుమారుడు, ఐదో తరగతి చదివే కూతురు ఉన్నారు. సత్యనారాయణ చనిపోయిన వార్త తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బొలెరో వాహనం వేగంగా వచ్చి, ఢీకొట్టడం వల్లే సత్యనారాయణ చనిపోయాడని మృతుడి బాబాయి కుమారుడు రాజమహేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బొలెరో డ్రైవర్, ఆర్నకొండకు చెందిన సంతోష్ రెడ్డిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ పేర్కొన్నారు.

కట్నం వేధింపులు.. భర్తకు ఏడేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: కట్నం కోసం భార్యను వేధించి, ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు జిల్లా జడ్జి బి.ప్రతిమ మంగళవారం ఏడేళ్ల జైలు శిక్ష , రూ.15వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల మేరకు.. మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం గ్రామానికి చెందిన జ్యోతి(22)కి, యాదాద్రి జిల్లా కొలనుపాక గ్రామానికి చెందిన వల్లెపు అశోక్‌తో 2016 ఏప్రిల్ 12న వివాహం జరిగింది. ఆ సమయంలో రూ.4లక్షల కట్నం ఇస్తామని, కొంతమేరకు ఇచ్చారు. మూడున్నర తులాల బంగారం అప్పగించారు. వివాహమైన కొద్దిరోజులకే జ్యోతిని భర్త అశోక్, అత్తమామలు వేధించసాగారు. పెద్దమనుషుల జోక్యంతో గొడవలు కాస్త సద్దుమణిగాయి. 2018లో గన్నేరువరం మండలం గుండ్లపల్లికి వచ్చిన అశోక్, జ్యోతి దంపతులు బావులు తవ్వే పనులు చేస్తూ అక్కడే నివాసం ఉన్నారు. 2018 ఏప్రిల్ 18న వీరికి ఆడపిల్ల జన్మించింది. పుట్టింటి వద్ద కొన్ని రోజులుంచి తిరిగి జ్యోతిని గుండ్లపల్లికి తీసుకెళ్లాడు. మళ్లీ కట్నంకోసం వేధించడంతో 2018 జూన్19న జ్యోతి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జ్యోతి తల్లి మారమ్మ ఫిర్యాదు మేరకు గన్నేరువరం పోలీసులు భర్త అశోక్, అతని కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశారు. అప్పటి రూరల్ ఏసీపీ ఉషారాణి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి ప్రతిమ అశోక్‌కు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధించారు. మిగితావారికి నిర్దోషులుగా వదిలిపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.వెంకటేశ్వర్లు కేసు విచారించి వాదించారు.

సీజనల్ వ్యాధులు షురూ



వానాకాలం వ్యాధుల కాలం.. నిరంతరం కురుస్తున్న వర్షాలు, లోపించిన పారిశుధ్యం, రోజుల తరబడి సూర్యకాంతి లేకపోవడం వంటి వాతావరణ పరిస్థితులు సీజనల్ వ్యాధుల సంక్రమణ, విస్తరణకు కారణమవుతున్నాయి. జనం జ్వరం బారినపడి చికిత్స కోసం మంగళవారం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలివచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల